క్లుప్తంగా

రోగులకు మెరుగైన వైద్య సేవలే ముఖ్యం

• డీసీహెచ్ఎస్ పద్మాంజలి దేవి



వైద్యశాల తనిఖీ చేస్తున్న డీసీహెచ్ఎస్ పద్మాంజలి దేవి

సదుం: రోగులకు మెరుగైన సేవలు అందించేలా సీహెచ్‌సీ సిబ్బంది కృషి చేయాలని డీసీహెచ్ఎస్ పద్మాంజలిదేవి ఆదేశించారు. స్థానిక సీహెచ్‌సీని మంగళవారం ఆమె తనిఖీ చేశారు. హాజరు పట్టిక, ల్యాబ్ రూం, ఫార్మసీ గది పరిశీలించారు. రోగులతో మాట్లాడి వైద్య సేవలపై ఆరా తీశారు. రోగులకు నాణ్యమైన భోజనం పెట్టాలన్నారు. ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ చేయాలని, పోస్టుమార్టం కోసం సౌకర్యాలు కల్పించాలని వైద్యులు ఆమెను కోరారు. కార్యక్రమంలో మెడికలాఫీసర్ డాక్టర్ పుష్పకుమారి, ప్రసాద్‌రాజు, శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆయాలకు బట్టల పంపిణీ



బట్టలు అందుకున్న ఆయాలతో లయన్స్ క్లబ్ సభ్యులు

పులిచెర్ల(కల్లూరు): మండలంలోని ప్రభుత్వ పాఠశాల్లో పనిచేస్తున్న ఆయాలకు లయన్స్ క్లబ్ కల్లూరు అధ్యక్షుడు పోకల తాతయ్య మంగళవారం పులిచెర్ల ఎంఆర్‌సీలో ఉచితంగా బట్టలు పంపిణీ చేశారు. వారికి భోజనం పెట్టారు. వారి సేవలను ప్రశంసించారు.కార్యక్రమంలో ఎంపీడీఓ రాజశేఖరబాబు, ఎంఈఓలు సిద్ధరామయ్య, తాతయ్య, జిల్లా క్రీడావిభాగం అధ్యక్షుడు లయన్ మహమ్మదాలీ, సుధాకర్, క్లబ్ సభ్యులు రాజారెడ్డి, ఆర్ఎన్ రాజన్, వెంకట సిద్దులు, రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

బెంగళూరు టు కాశీ.. సైకిల్ యాత్ర



కాశీకి సైకిల్‌పై వెళుతున్న ముత్తుకుమార్

పలమనేరు: 'బీ హ్యాపీ' అనే కాన్సెప్ట్‌తో బెంగళూరుకు చెందిన ముత్తుకుమార్(59) తన స్వస్థలం నుంచి కాశీకి సైకిల్ యాత్ర ప్రారంభించి మంగళవారం పలమనేరుకు చేరారు. ఆయన మాట్లాడుతూ తాను కొన్నేళ్లుగా దేశంలోని ప్రధాన నగరాల్లో సైకిల్ యాత్ర చేశానని తెలిపారు. ఈ పర్యాయం 'మనం మరణించేటప్పుడు వెంట ఏమీ రాదు..ఉన్నంత కాలం సంతోషంగా ఉందాం' అనే సందేశంతో సైకిల్ యాత్ర చేస్తున్నట్టు తెలిపారు.

బీఎస్ఎన్ఎల్‌కు 30 ఫిర్యాదులు



సమస్యలను ఆలకిస్తున్న అధికారులు

చిత్తూరు కార్పొరేషన్: వినియోగదారులకు మెరుగైన సేవలు అందిస్తామని బీఎస్ఎన్ఎల్ డీఈ సురేంద్రనాథ్ తెలిపారు. నగరంలోని ఆ శాఖ డివిజన్ కార్యాలయంలో మంగళవారం వినియోగదారుల సేవా శిబిరం నిర్వహించారు. పలు ప్రాంతాల నుంచి వచ్చిన వినియోగదారులు సమస్యలను అధికారులకు తెలియజేశారు. నెట్‌వర్క్ పరంగా 17, ఇంటర్‌నెట్ సేవలపై 5, బిల్లుల అంశంపై 6, ల్యాండ్ లైన్‌కు సంబంధించి 2 ఫిర్యాదులు వచ్చినట్లు డీఈ తెలిపారు. వాటిని క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సిబ్బంది ప్రతాప్‌రెడ్డి, సురేష్, హిమగిరి, శ్రీనివాసులు, రామస్వామి, అశ్వత్‌కుమార్, రెడ్డెప్ప, హరికృష్ణ పాల్గొన్నారు.

మొగరాల చెరువు కట్టపై అదుపు తప్పిన కారు



ముళ్ల పొదల్లో చిక్కుకున్న కారు

పాకాల : మితిమీరిన వేగంతో వెళ్తూ అదుపు తప్పి చెరువు కట్టపై నుంచి చెరువులోకి కారు దూసుకుపోయిన సంఘటన మండలంలోని మొగరాల సమీపంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. దామలచెరువు నుంచి కొమ్మిరెడ్డిగారిపల్లె వైపు వెళుతున్న కారు మొగరాల వద్ద చెరువు కట్టపై వేగంగా వెళ్తూ అదుపు తప్పింది. ఇక్కడ చెరువు కట్ట విస్తరణ పనులు చేస్తున్నారు. అలాగే విద్యుత్ స్తంభాలను నాటేందుకు కట్ట మీద ఉంచారు. అదుపు తప్పిన కారు విద్యుత్ స్తంభం మీదుగా చెరువులోని దూసుకుపోయింది. అక్కడ ముళ్ల పొదలకు తగులుకుని నిలిచిపోయింది. లేదంటే నీళ్లలోకి అమాంతంగా పోయేది. కారు స్థానికుల సహాయంతో బయటకు లాగారు. అదృష్టవశాత్తు కారులో ప్రయాణిస్తున్న వారికి ఏమీ కాలేదు.

చేపల వేట కాదు.. కప్పల వేట..!



వరి యంత్రం కోత కోస్తుంటే వరికంకుల నడుమ ఉన్న కప్పలను గుటుక్కుమనిపిస్తూ వస్తున్న కొంగలు

ప్రకృతితో మనుషులకు, పశు పక్ష్యాదులకు విడదీయరాని అనుబంధం ఉంది. ప్రకృతి అన్ని జీవరాశులకూ తగిన ఆహారంతో శక్తిని స్తోంది. రైతన్నలు భూమిని నమ్ముకుని ఆహారాన్ని పండిస్తే, ఆ మట్టినీ, ప్రకృతిపై ఆధారపడి జీవించే క్రిమికీటకాలు, ఉభయచరాలు, పశు పక్ష్యాదులు ఎన్నో ఎన్నెన్నో..! సైన్సు పాఠాల్లో చెప్పినట్లు ఇదో ఆహార గొలుసు కథ. అంతేకాదు..ఆధునిక కాలం ఆహారాన్వేషణలో సరికొత్త పాఠాలు నేర్పుతోంది. పక్షులు సైతం వీటిని ఒంటబట్టించుకుంటున్నాయని ఇక్కడి చిత్రం చెప్పకనే చెబుతోంది. పంట కోత కొచ్చిన వరి.. చకచకా మని క్షణాల్లో కోస్తున్న యంత్రం..రైతన్నలు ఎదుర్కొంటున్న కూలీల సమస్యను చాటింది. వరికోత యంత్రం పనులు మొదలెట్టడం ఆలస్యం ..సమీపంలోని చెరువు నుంచి కొంగల గుంపు ఇక్కడ వాలింది. చెరువులో ఒంటి కాలిపై తపస్సు చేస్తున్నట్టు కదలకుండా నిలబడినా సరిగా మేత వాటి చెంతకు రాలేదేమో..! ఇక్కడ పొలంలో వరి యంత్రం కోత కోస్తూ ముందుకు కదులుతూ ఉంటే కొంగలు ఏమాత్రం బెదరకుండా ముందూ..వెనుకా అలా..అలా ఎగురుతూ వరివెన్నులు మొదలు నరికిన చెట్లలా అలా తెగుతూంటే, మరో వైపు వరి వెన్నుల మోట్ల నుంచి బెకబెకలాడుతూ వస్తున్న చిన్నపాటి కప్పల్ని గుటుక్కు..గుటుక్కుమంటూ కొంగలు లాగించాయి. మొత్తానికి వరియంత్రం పుణ్యమా అని కప్పల ఫుల్ మీల్స్ లాగించేసి ఎగిరిపోయాయి. పులిచెర్ల మండలం కూనపల్లె గ్రామ సమీపంలోని వరి పొలాల్లో మంగళవారం చూపరులకు ఆహ్లాదం పంచిన దృశ్యమిది. ప్రకృతి చెప్పిన పాఠమిది. – పులిచెర్ల(కల్లూరు)



యంత్రం వెంబడే కప్పల కోసం వస్తున్న కొంగలు



ఈ పూటకు ఫుల్ మీల్స్ లాగించేశాం..మళ్లీ వస్తాం..

కరెంటు స్తంభం ఎక్కే దారేదీ..?



తీగల కారణంగా పైకి ఎక్కేందుకు తిప్పలు పడుతున్న రెస్కో ఉద్యోగి

కుప్పం పట్టణంలోని విద్యుత్ స్తంభాల చుట్టూ కేబుల్ వైర్లు చుట్టుకోవడంతో సంభాలు ఎక్కేందుకు రెస్కో సిబ్బందికి అవస్థలు తప్పడం లేదు. కింది నుంచి స్తంభం ఎంత ఎత్తుకు ఉంటే అంత వరకు ప్రైవేట్ డిష్, నెట్ కేబుళ్లు అనుమతులు లేకుండా ఇష్టానుసారంగా కట్టి ఉంచడంతో ఈ దురవస్థ కలుగుతోంది. కొన్నిసార్లు కేబుళ్లు కాలికి చుట్టుకోవడం పడిపోయే పరిస్థితి కలుగుతోంది. మరోవైపు ఒక ఫ్యూజ్ ఆఫ్ కాల్ చూడాలంటే తలప్రాణం తోకకు వస్తోందని సిబ్బంది గగ్గోలు పెడుతున్నారు. రెస్కో ఉన్నతాధికారులు విద్యుత్ స్తంభాలకు ఉన్న అనధికారిక కేబుళ్లను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు. – కుప్పం రూరల్

ఓటర్ల జాబితాపై ఆర్డీఓ సమీక్ష

– సమస్యలు ప్రస్తావించిన వివిధ పార్టీల నేతలు

పలమనేరు: ఓటర్ల జాబితాపై పలమనేరుకు సంబంధించిన వివిధ రాజకీయ పార్టీ నేతలతో స్థానిక ఆర్డీఓ భవాని మంగళవారం తన కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. నేతల సలహాలు–సూచనలు ఆమె స్వీకరించారు. వైఎస్సార్‌సీపీ నేత కండల నరేష్ మాట్లాడుతూ, నియోజకవర్గంలోని పది బూత్‌లత్‌పాటు మున్సిపాలిటీలోని రొంటకుంట్ల ప్రాంతంలో సమస్యలున్నాయని తెలిపారు. ముఖ్యంగా పట్టణానికి ఆనుకుని ఉన్న ఈ ప్రాంతంలో పన్నులు మాత్రం గంగవరం పంచాయతీకి అక్కడి ప్రజలు చెల్లిస్తున్నారని, ఓట్లు మాత్రం కొందరికి పంచాయతీలో మరి కొందరికి పట్టణంలో ఉన్నాయని, కొన్నేళ్లుగా ఉన్న ఈ సమస్యపై అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఇదే సమస్యను టీడీపీ, సీపీఐ నాయకులు సైతం ప్రస్తావించారు. తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్లు, ఆయా బీఎల్వోలతో కలిసి, ఆ ప్రాంత వాసులతో చర్చించి, వారి నిర్ణయం మేరకు ఓటర్ల జాబితాపై అభిప్రాయాలను సేకరించాలని ఆర్డీఓ ఆదేశించారు.

శిథిలావస్థలో బస్ షెల్టర్లు



కుంజేగానూరు క్రాస్‌లో శిథిలావస్థకు చేరిన బస్ షెల్టర్

కుప్పం రూరల్: మండల కేంద్రం కుప్పం నుంచి గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే రహదారులపై రెండు దశాబ్దాల క్రితం వేలాది రూపాయలు వెచ్చించి నిర్మించిన బస్సు షెల్టర్లు ప్రస్తుతం ప్రయాణికులకు ఆశ్రయం ఇవ్వకపోగా కూలిపోయే స్థితికి చేరుకున్నాయి. పైకప్పు పెచ్చులూడి ఉరుస్తుండడంతో ప్రయాణికులు షెల్టర్ల వద్దకు వెళ్లడం లేదు. దీంతో షెల్టర్లలోని కూర్చునేందుకు వేసిన అరుగులు కూడా దెబ్బతిన్నాయి. అయితే కొద్దిపాటి మరమ్మతులు చేస్తే వీటిని వినియోగంలోకి తేవొచ్చని ప్రయాణికులే చెబుతున్నారు. ఈ దిశగా సంబంధిత అధికారులు మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.

నివేశ స్థలాల ధ్రువీకరణకు స్పెషల్ డ్రైవ్

శాంతిపురం: పక్కా ఇళ్ల నిర్మాణానికి అవసరమైన నివేశ స్థలాల ధ్రువీకరణ పత్రాల జారీ కోసం మండలంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్టు ఎంపీడీఓ కుమార్, తహసీల్దార్ శివయ్య చెప్పారు. మండల సచివాలయంలో మంగళవారం వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులకు సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. సిబ్బంది గ్రామాల్లో లబ్ధిదారుల సమావేశాలు నిర్వహించి అర్హత గల వారికి ఇంటి స్థలాలకు పట్టాలు జారీ చేయాలన్నారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద మండలంలో 2,243 కుటుంబాలు పక్కా గృహాలు అవసరమని గుర్తించగా వారిలో 1,998 మందికి సొంత స్థలాలు ఉన్నాయన్నారు. అధికారులు గ్రామాల్లోని లబ్ధిదారులను కలిసి అనుభవం, తగిన డాక్యుమెంట్లను పరిశీలిస్తారని చెప్పారు. ఎస్ఐ నరేష్ మాట్లాడుతూ, గ్రామాల్లో నిరుపయోగంగా ఉన్న భవనాలు, ప్రాంతాలు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారే అవకాశం ఉందన్నారు. అధికారులు దీనిపై దృష్టి పెట్టడంతో పాటు ముఖ్యమైన ప్రాంతాలు, గ్రామ సచివాలయాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డిజిటల్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

గంగవరం: శ్రవణా నక్షత్రం సందర్భంగా టీటీడీ అనుబంధ కీలపట్ల కోనేటిరాయస్వామి ఆలయంలో మంగళవారం కల్యాణోత్సవాన్ని భక్తజన సందడి నడుమ ఆలయ అర్చకులు కనుల పండువగా నిర్వహించారు. తొలుత ఆస్థాన మండపంలో స్వామి వారిని శ్రీదేవి భూదేవి సమేతంగా ప్రత్యేక కళ్యాణ వేదికపై కొలువుదీర్చి, వివిధ రకాల పుష్పాలతో విశేషంగా అలంకరించారు. అర్చక బృందం వేద మంత్రాలు, మేళతాళాల నడుమ కల్యాణోత్సవం నిర్వహించారు. అనంతరం ఉత్సవర్లపై తలంబ్రాలు కురిపించి మహా మంగళహారతులిచ్చారు. భక్తులు సంప్రదాయ దుస్తులతో కల్యాణోత్సవానికి హాజరయ్యారు. ఆ తరువాత పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు కొబ్బరికాయలు కొట్టి కర్పూర నీరాజనాలు సమర్పించారు. టెంపుల్ ఇన్‌స్పెక్టర్ నీరుకుండ గజేంద్ర, అర్చకులు దేవరాజాచార్యులు, శ్రీహర్ష దీక్షితులు, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.



కల్యాణోత్సవానికి హాజరైన భక్తులు

పుడమి తల్లిని కాపాడుకుందాం

పులిచెర్ల(కల్లూరు): భావితరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించడం అందరి బాధ్యతని గ్రీన్ మాస్టర్ వెంకటసిద్దులు, డివిజన్ కన్వీనర్ రాజేంద్ర తెలిపారు. ప్రపంచ ధరిత్రీ దినోత్సవం సందర్భంగా మంగళవారం కల్లూరు హైస్కూలు విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ, మనముంటున్న భూమి, వాతావరణం సక్రమంగా ఉండేలా చూడాల్సి ఉందన్నారు. భూమి మీద జీవరాసులు మనుగడ కొనసాగించాలంటే పర్యావరణ సమతుల్యతకు పాటుపడాలని, లేనిపక్షంలో జీవరాశుల మనుగడ ప్రశ్నార్థకమవుతుందన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం శ్రీవాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ప్లకార్డులతో విద్యార్థుల ర్యాలీ

నోటీస్ బోర్డు

నేడు మండల సమావేశం

సదుం: మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం బుధవారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ హరిబాబు తెలిపారు. అన్ని శాఖల అధికారులు, సభ్యులు హాజరు కావాలని కోరారు.

28 నుంచి వేసవి శిక్షణా తరగతులు

పలమనేరు: పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో ఈనెల 28 నుంచి జూన్ 6వ తేదీ వరకు విద్యార్థులకు వేసవి శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్టు లైబ్రేరియన్ హేమకుమార్ మంగళవారం తెలిపారు. పిల్లలకు క్విజ్, చెస్, క్యారమ్స్, జీకే, స్పోకెన్ ఇంగ్లిష్‌లలో శిక్షణ ఇస్తామని, దీనిని పట్టణంలోని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

శుభ్రతతోనే సగం వ్యాధులు దూరం

చిత్తూరు రూరల్ (కాణిపాకం): శుభ్రతతోనే సగం వ్యాధులు దూరమవుతామని జిల్లా మలేరియా అధికారి వేణుగోపాల్ పేర్కొన్నారు. చిత్తూరు మండలం బీఎన్ఆర్‌పేట పీహెచ్‌సీలో మంగళవారం బోదకాళ్లల బాధితులకు కిట్లు పంపిణీ చేశారు. ఆ కిట్ ఎలా వాడాలో ప్రయోగాత్మకంగా తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వర్షాల కారణంగా దోమల ఉధృతి ఉంటుందన్నారు. దీని ధాటికి పలు రోగాలు వచ్చే అవకాశాలున్నాయన్నారు. ముఖ్యంగా బోదకాళ్ల బాధితులు శుభ్రత పాటించాలన్నారు. డాక్టర్ల సలహాల మేరకు మందులు, మాత్రలు వాడాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి చంద్రమహేష్, ఏపీఎంఓ దయ, సిబ్బంది రామకృష్ణ, నారాయణ, సంతప్‌కుమార్, త్రిలోక్, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై పోరాటం చేద్దాం



ఎమ్మెల్సీ భరత్‌ను కలిసిన రామకుప్పం మండల పార్టీ నూతన కమిటీ సభ్యులు

• నూతన కమిటీ సభ్యులకు ఎమ్మెల్సీ భరత్ మార్గదర్శనం

కుప్పం: కుప్పం నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ బలోపేతానికి నూతన కమిటీ కృషి చేయాలని ఎమ్మెల్సీ భరత్ మార్గదర్శనం చేశారు. మంగళవారం రామకుప్పం నూతన వైఎస్సార్‌సీపీ కమిటీ సభ్యులు కుప్పం ఎమ్మెల్సీ క్యాంపు కార్యాలయంలో ఆయన్ను కలిశారు. వారిని అభినందించి ఆయన మాట్లాడారు. ప్రజా సమస్యలపై పోరాటం చేస్తూ ప్రజల మన్ననలు పొందాలన్నారు. ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను, హామీలపై కప్పదాటు వైఖరిని ప్రజల్లో ఎండగట్టాలని, తద్వారా గ్రామస్థాయి నుంచే బలోపేతం కావాలని పిలుపునిచ్చారు. ఇలా ప్రజల్లో ఉంటూ రాబోయే స్థానిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయకేతనం ఎగురవేసేందుకు కమిటీ సభ్యులందరూ కార్యకర్తలతో సమన్వయ కృషి చేయాలన్నారు. కష్టపడి పనిచేసిన ప్రతి ఒక్కరికీ పార్టీ తగిన గుర్తింపు ఇస్తుందన్నారు. కార్యక్రమంలో రామకుప్పం జెడ్పీటీసీ నితిన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ సుబ్రహ్మణ్యం, కో–కన్వీనర్ చంద్రారెడ్డి, బాబురెడ్డి, సింగిల్‌విండో మాజీ చైర్మన్ సుగునప్ప, రవినాయక్, భాస్కర్ నాయక్, ఎంపీటీసీ వెంకటేష్, రామకుప్పం మండల పార్టీ అధ్యక్షులు వెంకట్రామిరెడ్డి, ఉపాధ్యక్షులు పెన్వెల్ సింహా, రవి నాయక్, మండల కార్యదర్శి రాజగోపాల్, నాగరాజు, మంజునాథ్, శ్రీధర్ రెడ్డి, కామరాజు నాయక్, శివశంకర్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఈచర్ వాహనం బోల్తా

గుడిపాల: చిత్తూరు–వేలూరు జాతీయ రహదారిలోని పానాటూరు సమీపంలో మంగళవారం తెల్లవారుజామున ఈచర్ వాహనం బోల్తా పడింది. చిత్తూరు నుంచి వేలూరుకు బత్తాయి కాయల లోడుతో ఈచర్ వాహనం బయల్దేరింది. డ్రైవర్ నిద్రమత్తులో అదుపుతప్పి రోడ్డుపై బోల్తాపడింది. ఆ సమయంలో ఎదురుగా వాహనాలు ఏవీ రాకపోవడంతో ప్రాణాపాయం తప్పింది.

రక్తహీనత రహిత సమాజమే లక్ష్యం



పులిచెర్లలో పోస్టర్లను ప్రదర్శిస్తున్న అధికారులు

పులిచెర్ల(కల్లూరు): రక్తహీనత రహిత సమాజమే లక్ష్యమని ఐసీడీఎస్ సీడీపీఓ మల్లీశ్వరి అన్నారు. పులిచెర్ల ఐసీడీఎస్ కార్యాలయంలో మంగళవారం పోషణ్ పక్వాడా పక్షోత్సవాలు ముగిశాయి. అంగన్‌వాడీ కార్యకర్తలకు సమావేశం ఏర్పాటు చేసి ఆమె మాట్లాడారు. గర్భిణులు, బాలింతల్లో రక్తహీనత సమస్యల బారిన పడకుండా ఉండేందుకు మంచి పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. గర్భం దాల్చినప్పటి నుంచి ప్రసవానంతరం బిడ్డకు రెండేళ్లు వచ్చేవరకు ఇది తప్పనిసరి, గ్రామాల్లో దీనిపై విస్తృత ప్రచారం చేయాలన్నారు. అనంతరం పక్షోత్సవ పోస్టర్లను ప్రదర్శించారు.కార్యక్రమంలో ఎంపీడీఓ రాజశేఖర బాబు, సూపర్‌వైజర్లు విజయలక్ష్మి, శిరీష, రమాదేవి, మెడికలాఫీసర్ షమామ, కార్యకర్తలు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

కుప్పం రూరల్: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని ఐసీడీఎస్ సీడీపీఓ చంద్రకళ అన్నారు. మంగళవారం పట్టణంలోని మోడల్ అంగన్‌వాడీ, కొటాలూరు అంగన్‌వాడీల్లో పోషణ్ పక్వాడా కార్యక్రమం నిర్వహంచారు. సీడీపీఓతో పాటు సూపవైజర్ దిల్‌షాద్ మాట్లాడారు. గర్భం దాల్చిన నాటి నుంచి వెయ్యి రోజుల పాటు తీసుకోవాల్సిన జాగ్రత్తలతోపాటు పిల్లలు అనీమియా బారిన పడకుండా తల్లులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. తల్లులు పిల్లలను అంగన్‌వాడీల్లో చేర్పిస్తే అక్కడ ఇచ్చే పౌష్టికాహారంతో పిల్లలు ఆరోగ్యవంతంగా ఉంటారన్నారు. ప్రతి ఒక్కరు పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీలు, సూపర్‌వైజర్లు, తల్లులు పాల్గొన్నారు.



కుప్పం రూరల్‌లో..

ప్రాంగణ ఎంపికల్లో 9 మందికి ఉద్యోగాలు



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో అధ్యాపకులు

కుప్పం రూరల్: కుప్పం డిగ్రీ కళాశాలలో నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో 9 మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ సుధారాణి తెలిపారు. బెంగళూరుకు చెందిన ఆల్ డిజిటెక్ సంస్థ మూడు రౌండ్లలో ఇంటర్వ్యూలు నిర్వహించింది. గ్రూప్ డిస్కషన్, వ్యక్తిత్వ పరీక్ష, హెచ్ ఆర్ రౌండ్లలో విద్యార్థులు పోటీపడ్డారు. ప్రతిభ ఆధారంగా తొమ్మిది మందిని ఎంపిక చేసింది. కళాశాల చైర్మన్ బీసీ నాగరాజు, చైర్‌పర్సన్ శాంతా నాగరాజు, వైస్ చైర్మన్ డాక్టర్ సునీల్, సీఈఓ సాగర్‌రాజ్ వారిని అభినందించారు. కార్యక్రమంలో ప్లేస్‌మెంట్ సెల్ ప్రతినిధి పార్థిబన్, ఆల్ డిజిటెక్. ప్రతినిధి బాబా ఫక్రుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.